క్లుప్తంగా

ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

మాగనూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న శాశ్వత డాక్టర్, ఫార్మసిస్ట్, సీనియర్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, అటెండర్, స్టాఫ్‌నర్సుల పోస్టులను భర్తీచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం వస్తే సరైన సిబ్బంది లేక ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

విద్యార్థికి సన్మానం



మాగనూర్:ఉమ్మడి మాగనూర్, కృష్ణా గ్రామీణ వైద్యుల సంఘం తరుపున మాగనూర్ ఆర్ఎంపీ డాక్టర్ ఖాజాహుస్సేన్ కూమారుడు ఎండీ పర్వేజ్ ప్రతిమ రిలీఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వరంగల్ గవర్నమెంట్ ఎంబీబీఎస్‌సీటు సాధించిన సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి మండల అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో పేదలకు సేవలందిస్తున్న ఆర్ఎంపీ వైద్యుడు తనయుడు ఎంబీబీఎస్ సీటు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంఘం తరపున అన్నివిధాలుగా తోడుంటామన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కూమార్, మాధవ్‌కృష్ణ, రాంచందర్, తాయప్ప, చంద్రశేఖర్, రామకృష్ణ, యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్వ: మహిళల దశాబ్దాల కల నెరవేర్చిన ప్రధాని మోదీకి దేశ మహిళలు రుణపడి ఉంటారని సర్పంచ్‌పెద్దింటి సంధ్య అన్నారు. బుధవారం మండలంలోని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు జిల్లా నాయకులు జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు చట్టసభలో 33శాతం రిజర్వేషన్‌లు కల్పించే బిల్లును ఆమోదించి చరిత్రలో బీజేపీ ప్రభుత్వం సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, అయ్యన్న, రవికుమార్, నరేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

'పేటలో బీజేపీ జెండా ఎగరాలి'

మరికల్: పేట నియోజకవర్గంలో ఈసారి బీజేపీ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని నియోజకవర్గ నాయకులు సత్యయాదవ్ అన్నారు. బుధవారం ఆయన తన అనుచరులతో నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర మీడియ కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, నరేష్‌గౌడ్, వెంకటేష్, రమేష్, వేణు, కొండయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నర్వ: నేడు మండల కేంద్రంలో ఉదయం 11గంటలకు బీఆర్ఎస్ నూతన కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వహించొద్దు

మాగనూర్: మండలంలో నిర్వహించే అభివృద్ధి పనులపై అలసత్వం వహించొద్దని ఎంపీడీవో శశికళ అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ.. అధికారులు దళితబంధు, గృహలక్ష్మి లిస్ట్ పరిశీలన క్షేత్రస్థాయిలో చేయాలని ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. పంచాయతీల పరిధిలో వాచర్‌లను ఎంపికచేసి హరితహారం మొక్కలకు నిత్యం ట్యాంకర్లతో నీటిని కొట్టించాలని తెలిపారు. ఉపాధికూలీల ఈకేవైసీ బ్యాంకులో పెండింగ్ ఉంటే పూర్తిచేయించాలన్నారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బంది లేనిచో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 22నుంచి నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

మద్దూరు: వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద చేపడుతున్న మహాధర్నా కరపత్రాన్ని బుధవారం స్థానిక మహిళ సమాఖ్య భవనంలో వికలాంగుల హక్కుల జిల్లా అధ్యక్షుడు కాశప్ప, ప్రధాన కార్యదర్శి రాదమ్మ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 10వేల పెన్షన్, కమిషన్ ఏర్పాటు, వికలాంగుల బంధు, ఉచిత విద్యుత్ తదితర డిమాండ్ల సాధనకోసం ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారమ్మ, నీలమ్మ, నర్సింహులు, మైబన్న, పాపమ్మ, చిట్టెమ్మ, రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం

● ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు గొర్రెలను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మరికల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నసంక్షేమ పథకాలతో పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి వచ్చిన 12యూనిట్ల గొర్రెలను బుధవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల కాపరులకు ప్రభుత్వం గొర్రెలను అందజేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధిచెందాలని సూచించారు. మిగితా 80మంది లబ్ధిదారులతో కూడా గొర్రెలకోసం డీడీలు కట్టించుకోవాలని అర్హులైన వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, భాస్కర్, రాజవర్ధన్‌రెడ్డి, చింతలయ్య, రఘునాథ్ రెడ్డి, మల్లేష్, ఎల్లప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: బీఆర్ఎస్ నేత, తెలంగాణ గాయకుడు దివంగత సాయిచంద్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల గుండెల్లో సాయిచంద్ చిరస్థాయిగా నిలిచి పోయారని గుర్తుచేశారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ బీఆర్ఎస్‌లో చిట్టెం సమక్షంలో చేరారు. కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిచంద్ జయంతి



ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: బీఆర్ఎస్ నేత, తెలంగాణ గాయకుడు దివంగత సాయిచంద్ జన్మదినం సందర్భంగా ఖాజీపూర్ జీవీఆర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం స్థానిక షాగార్డెన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరై సాయిచంద్ రాష్ట్రానికి, ఉద్యమ సమయంలో చేసిన సేవలను మరువనిలేవన్నారు. అనంతరం రక్తదానం చేసినా వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్‌రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని బుధవారం ఉద్యమ నాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రచార కార్యదర్శి బండారి ఆనంద్, పార్టీ అధికార ప్రతినిధి రామలింగం, నేతాజీరెడ్డి పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు కనీసవేతనం అమలు చేయాలి



నర్వ: ప్రభుత్వం ఆశవర్కర్లకు కనీస వేతనం రూ. 18వేలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు మహేందర్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజగణేష్‌కు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ సీహెచ్ఓ ప్రభాకర్‌శెట్టికి వినతిపత్రాన్ని అందించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ.. ఆశల సమస్యలను ప్రభుత్వం అమలు చేయకపోతే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు పద్మ, శివలింగమ్మ, మణెమ్మ, భీమమ్మ, లావణ్య, మంజుల పాల్గొన్నారు.

హన్మకొండకు తరలిన క్రీడాకారులు

నారాయణపేట రూరల్: రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా క్రీడా పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బుధవారం హన్మకొండకు తరలివెళ్లారు. గతరెండు రోజుల క్రితం మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో చక్కటి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ రమణ తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. వీరిని అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు నందునామాజీ, అంబరీష్ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

భవన నిర్మాణ పనుల పరిశీలన



ఊట్కూరు: పంచాయతీ భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం తిప్పరాస్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. భవన నిర్మాణానికి వాడుతున్న స్టీల్, ఇటుక, సిమెంట్‌ను తదితర వివరాలను కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమంగళ, గ్రామస్తులు నారాయణ, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

మద్దూరు: మండలంలోని రోడ్డువిస్తరణ పనులను పోలీసుల బందోబస్తు మధ్యన ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం ప్రారంభించారు. 5.25 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో తుంకిమెట్ల నుంచి పేటరోడ్డులోని 43.6కిలో మీటర్ నుంచి 46.2 కిలోమీటర్ వరకు 35ఫీట్ల డివైడర్‌తో కూడిన రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్అండ్‌బీ డిప్యూటీ రాములు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడంపై ఏలాంటి నోటీసులు లేకుండా చేపట్టడం ఎమిటని దుకాణాల యజమానులు పాతబస్టాండ్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో పోలీసులు సర్ది చెప్పి ధర్నా విరమించారు.



జేసీబీలతో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగిస్తున్న పోలీసులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీ, ఇద్దరికి గాయాలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా.. దామరగిద్దకు చెందిన చాకలి బస్సప్ప పెట్రోల్‌బంక్ వైపు నుంచి ప్రధాన రహదారిపైకి వస్తున్న సమయంలో పేటనుంచి వస్తున్న అదే గ్రామానికి వ్యక్తి రోడ్డుపై అతివేగంతో వస్తు అదుపు తప్పడంతో రోడ్డుపైకి వస్తున్న వహనాన్ని ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పథకాల గురించి వివరిస్తున్న భీమన్న

ధన్వాడ: మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలను ప్రారంభించిందని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు భీమన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మత్స్యకార్మికులతో సమావేశం నిర్వహించి పథకాలపై వివరించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘంలో సభ్యత్వం తీసుకున్నవారికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద జీవనోపాధికి ఉపయోగపడే విధంగా మొబైల్ క్యాంటీన్, నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు మంజూరు చేస్తుందన్నారు. మండలవారీగా కమిటీలు ఏర్పాటుచేసి సభ్యత్వం తీసుకుని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహులునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయభాను, సభ్యులు భారతి, ఆశప్ప, నర్సింహులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు



కోస్గిలో ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు



పేటలో శాతవాహన కాలనీలో పూజలు చేస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: పట్టణం, మండల వ్యాప్తంగా ప్రతిష్ఠించిన లంబోదరులకు మూడోరోజు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలతోపాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు పూజలు చేశారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీ సాయి స్కూల్‌లో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడికి విద్యార్థులు పూజలు చేసి నిమజ్జనం చేశారు. శాతవాహన కాలనీలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కుమ్మరివాడలో అతిపెద్ద మట్టి వినాయకుడితోపాటు సుమారు 250 మట్టి ప్రతిమలు తయారుచేసి మల్లేష్, తిరుపతి, వెంకట్రాములును అఖిల భారత అయ్యప్ప దీక్షసమితి తరపున శాలువాతో సన్మానించారు.

కోస్గి: పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆయా కాలనీలకు చెందిన యువకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని బాహార్‌పేట, నీలకంఠస్వామి ఆలయం, ఎస్సీ కాలనీ, శివాజీ చౌరస్తా, వినాయక్‌నగర్, నాగులబావి, టీచర్స్ కాలనీల్లోని వినాయక మండపాలను సందర్శించి పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, రాజేష్, మాస్టర్ శ్రీను, బాలేష్, వెంకట్‌నర్సింహులు, కోడిగంటి హరి పాల్గొన్నారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీలోని వినాయకుడికి ఎంపీడీఓ కాళప్పతోపాటు మండల అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంతోపాటు అన్నదాన కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

మరికల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకులకు భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వినాయక మండపాల వద్ద గ్రామస్తులకు అన్నదానం చేపట్టారు.

ఊట్కూరు: వినాయక ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయకులకు భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుజల అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. ఇసర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జగదీష్‌గౌడ్, తరుణ్ పాల్గొన్నారు.



ఊట్కూరులో..



కోస్గిలో పూజలో పాల్గొన్న మండల అధికారులు



మరికల్‌లో..

ఘనంగా శ్రీరామ్‌దేవ్ జీ మహరాజ్ జయంతి

నారాయణపేట: శ్రీ విష్ణు సమాజసేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జీపీశెట్టి ఫంక్షన్‌హాల్‌లో శ్రీ రామ్‌దేవ్‌జీ మహరాజ్ జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తిభజనలతో జాగరణ, భజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారయణ భట్టడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రాజస్థాన్‌కు చెందిన ప్రముఖ గాయని పూర్ణ భారతి దేవ్కీ జలోర్, భజన కళాకారుడు తన అద్భుత కళను ప్రదర్శించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఘనంగా సంకటరహర గణపతి హోమం

స్థానిక సుభాష్‌రోడ్‌లోని శక్తిపీఠం శ్రీ సంత్‌మత మూల మహాసంస్థానం ఆధ్వర్యంలో శ్రీ మహగణపతి బ్రహ్మోత్సవాలు రెండోరోజూ కొనసాగాయి. జ్ఞాన యజ్ఞంలో భాగంగా బుధవారం ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ ఊట్కూర్ శివానంద్ పురోహిత్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శక్తిపీఠంలో కొలువైన శ్రీవరసిద్ధి వినాయకస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అర్క పత్రాలతో అర్చన చేశారు. దోమవాణి సుధాకర్ దంపతులచే సంకటహర గణపతి హోమం నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలుచేసి, మహా నివేదన సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ, సేవాసంగతన్ అధ్యక్షులు మంగళరాం, కాలూరం, హింతారం, బల్‌వీర్‌సింగ్, గణపత్‌లాల్, రమేశ్, గజేంద్రసింగ్, లక్ష్మణరామ్, నర్సింహ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ భట్టడ్, రుద్రసముద్రం రాములు, నడిమిండి మురళీధర్, రాజశేఖర్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ బాలయ్య సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం మండలంలోని జిలాల్‌పూర్‌లో కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్‌ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయొద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ1930కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్యానాయక్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఊట్కూరు: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ రాములాల్ కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవాల సందర్భంగా శాంతిసమావేశం నిర్వహించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. మండలంలో అన్నిగ్రామాల్లో వినాయక విగ్రహాల ప్రతిష్ఠ జరిగిందని, ప్రజలు పోలీసులకు సహకరించి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం రోజు వినాయక మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, ఎంపీడీఓ రమేష్, ఆర్ఐ రాఘవేందర్, ఎస్ఐ గోకరి, సమీర్‌అలీ, నాసిర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాములాల్

కాంగ్రెస్ హామీలు నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ధన్వాడ: కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొదిగెలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఉమ్మడి రాష్ట్రాన్ని నలభైఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఒక బీసీ అభ్యర్థిని ఎందుకు ముఖ్యమంత్రిని చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. అధిపత్య వర్గాలకు ప్రజలకు పథకాల పేరుతో మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బహుజనుల బతుకులు మారాలంటే అది బీఎస్పీతోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీకి ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మైనార్టీ కన్వీనర్ సయ్యద్‌మహమూద్, నాయకులు శ్రీకాంత్, బాలప్ప పాల్గొన్నారు.

యువకులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

నారాయణపేట: దేశ, రాష్ట్రాల్లో యువకులు దేశభక్తిని పెంపొందించుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. బుధవారం జిల్లాలోని భగత్‌సింగ్ భవన్‌లో పేట డివిజన్ మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడారు.. దేశంలో యువకులు చెడు వ్యసనాలకు బానిసై కులమత రాజకీయాలకు అలవాటుపడి దేశభక్తిని మర్చిపోతున్నారన్నారు. యువకులు భగత్‌సింగ్ చంద్రశేఖర్ అజాద్ లాంటి వారి ఆశయాలతో ముందుకు నడిచి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన డివిజన్ పీవైఎల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా అంబటి అంజి, ఉపాధ్యక్షుడిగా బోయరవి, సహాయ కార్యదర్శి శ్రీకాంత్‌సాయి, కో-శాధికారి మధును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూఓ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు ప్రశాంత్ వెంకట్‌రాములు, హజీ, బోయిన్‌పల్లి రాము, ఈశ్వర్, ప్రతాప్, సలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బి.రాము

సీఈఓ మహిపాల్‌పై డైరెక్టర్ ఆగ్రహం

మద్దూరు: ప్రాథమిక సహకార సంఘం దమ్‌గాన్‌పూర్‌లో సీఈఓ మహిపాల్, చైర్మన్ జగదీశ్వర్ అవినీతి పాల్పడినట్లు డైరెక్టర్ నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కార్యాలయంలో డైరెక్టర్లతో సమావేశం సమావేశం నిర్వహించి మాట్లాడారు.. గత సీజన్‌లో వరిధాన్యం కొనుగోలు జరిగేటప్పుడు రైతులు ఒకబస్తా ధాన్యం 40కిలోల 700 గ్రాములు సేకరించాలి, కానీ రైతులనుంచి 42కిలోలు తీసుకొని మిగిలిన ధాన్యాన్ని చైర్మన్ అమ్ముకున్నట్లు తెలిపారు. రైతులు రుణాల ద్వారా ఇతర చెల్లింపుల ద్వారా సంఘం జమచేసినా ఒక లక్షా 24వేలు జమచేయకుండా పెట్టుకున్నట్లు తెలిపారు. వీటిపై జిల్లా అధికారి కొదండరాంకు జూన్ 17న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదు తర్వాత కొంతమేరకు డబ్బులు చెల్లించారన్నారు. రైతులు సొంత ట్రాక్టర్ల ద్వారా మిల్లుల కు ధాన్యం తరలిస్తే లారీల్లో తరలించినట్లు బిల్లులు చూయించి సీఈఓ, చైర్మన్ డబ్బులు స్వాహా చేసినట్లు ఆరోపించారు.

సత్యయాదవ్ జన్మదిన వేడుకలు

దామరగిద్ద: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్ జన్మదినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో సంజీవ ఆలయంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంజీవరాయ ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, జిల్లా నాయకుడు గోపాల్ రావ్, జైపాల్‌రెడ్డి, మాణిక్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, ఎంపీటీసీ అంజి పాల్గొన్నారు.